సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025
I

సండే స్పెషల్

ఇంజనీర్ల ఇలాకా..

అదో మారుమూల గిరిజన తండా. వారికి తెలిసిందల్లా కూలి పని చేయడమే. రెక్కలు ముక్కలు చేసుకొని కుటుంబాలు వెళ్లదీసుకుంటారు. మేము పడే కష్టం మా పిల్లలు పడకూడదని కష్టపడి చదివించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన గిరిజనులు అదే దారిలో వెళ్లారు. ఒక్కొక్కరు ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తూ ఇతర తండాలు, గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు కంగ్టి మండలంలోని జమ్గి(బీ) సాధు తండా యువకులు. ఏకంగా ప్రభుత్వ కొలువుల్లో 40 మంది ఉండగా.. ఇందులో 20 మంది ఇంజనీర్లే కావడం విశేషం.

– కరణం సుదర్శన్ రావు, కంగ్టి(నారాయణఖేడ్)



వివరాలు II లో..

న్యూస్‌రీల్

కార్పొరేట్ కళాశాలల స్కీమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్పొరేట్ కళాశాలల స్కీమ్ గుర్తింపు కోసం జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే కాలేజీ యాజమాన్యాలు తమ కళాశాల గుర్తింపు పత్రాలు, విద్యార్థులకు కల్పిస్తున్న హాస్టల్ , తరగతి గదుల వివరాలు, తదితర పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు చివరి గడువు ఈ నెల 30 వరకు ఉందని, అప్లికేషన్ పత్రాలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

27న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ విద్యాసంవత్సరం (2025–2026)కు గాను జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇర్కోడ్ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు 7వ, 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సందేహాలుంటే 9000872723 ను సంప్రదించాలన్నారు.

పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెలవుల్లో పిల్లలు సరదాగా ఈతకు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి విలువైన ప్రాణాలు పొగొట్టుకోవద్దని తెలిపారు. తల్లిదండ్రులు వెంట ఉండి పిల్లలకు ఈత నేర్పించాలన్నారు. ఈత రాని వారు బావులు, చెరువులు, కుంటల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం నాటినవి ప్రస్తుతం జిల్లాలో కోత దశకు వచ్చాయన్నారు. తోటలను సాగు చేయాలనుకుంటున్న రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీతో పాటు, మొక్కలను అందజేస్తుందన్నారు. సాగు చేస్తున్న రైతులకు తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఆయిల్ పామ్ గెలలను ఫ్యాక్టరీకి తరలించిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లేశం, ఉద్యాన శాఖ అధికారి రమేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాధ్యతలు న్యాయమూర్తి మిలింద్ కాంబ్లే చేపట్టినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించిన న్యాయమూర్తి స్వాతిరెడ్డి ఇటీవల రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆమె స్థానంలో ప్రస్తుతం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న న్యాయమూర్తి మిలింద్‌కాంబ్లే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

చేర్యాల(సిద్దిపేట): మహిళలు హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. అంబేడ్కర్, పూలే జయంతిని పురస్కరించుకొని ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మహిళా హక్కుల పరిరక్షణ బస్సు యాత్ర శనివారం చేర్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఎక్కువ.. మంజూరు తక్కువ

గృహ యోగం ఎవరికో?



ఇందిరమ్మ మోడల్ హౌస్

- ఇందిరమ్మ ఇళ్లకు 2.30 లక్షల మంది దరఖాస్తులు
- అర్హులు లక్షకు పైగా.. మంజూరు కొన్నే..
- ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్‌లో 2,667 మంది ఎంపిక
- కాంగ్రెస్ నేతల చుట్టూ దరఖాస్తు దారుల ప్రదక్షిణలు

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఉత్కంఠ రేపుతోంది. దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం, మంజూరు తక్కువగా ఉండటంతో ఎవరిని ఎంపిక చేస్తారు? సమాన అర్హత ఉంటే ప్రాధాన్యం ఎవరికి ఇస్తారు? ఇలా అనేక సందేహాలతో దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి కుటుంబానికి సొంతిల్లు అనేది ఒక కల. పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి నిర్మాణం ప్రస్తుత పరిస్థితుల్లో తలకు మించిన భారంగా మారింది. నిర్మాణానికి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న వారు లక్షకు పైగా ఉన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో 2,30,483 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. వాటిని క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి ఇంటి స్థలం ఉండి పక్కా ఇళ్లు లేనివారు 76,337, ఇంటి కోసం స్థలం లేని వారు 34,404 మందిని గుర్తించారు.

పైలెట్ ప్రాజెక్ట్‌లో 2,667 మంది..

పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మండలానికి ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. జనవరి 26వ తేదీన 2,667 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అందులో 612 మంది ముగ్గు పోయగా, 166 మంది పునాది చేశారు. వాటిలో 146 మందికి ఇటీవల మొదటి విడత రూ.లక్ష చొప్పున లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ1.46కోట్లను జమ చేశారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఇంటి నిర్మాణం చేస్తే త్వరగానే బిల్లులు వస్తాయని దరఖాస్తుదారుల్లో నమ్మకం కలిగింది.

ఎవరిని ఎంపిక చేస్తారో?

పైలెట్ ప్రాజెక్ట్‌లో కేటాయించిన మొత్తంలోంచి తొలగించి, మిగతా ఇళ్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని హౌజింగ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అర్హులు లక్షకు పైగా ఉన్నారు. మంజూరు తక్కువగా ఉండటంతో ఎవరిని ఎంపిక చేస్తారో.. సొంతింటి కల నెరవేరుతుందో లేదోనని ఆశగా దరఖాస్తు దారులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఆర్థిక, సామాజిక కులగణన సర్వే కొలమానంగా తీసుకొని ఎంపిక చేస్తారా? ఏ ఊరికి ఎన్ని ఇళ్లు అనేది మంజూరు అయ్యాకే లబ్ధిదారుల ఎంపికలు ప్రారంభం అవుతాయా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ప్లాస్టిక్ షీట్‌తో గుడిసెలు, మట్టితో ఉన్న నివాసులతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, వితంతువులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలున్నాయి. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని స్థానిక కాంగ్రెస్ నేతల చుట్టూ దరఖాస్తు దారులు ప్రదక్షిణలు చేస్తూ ప్రాధేయపడుతున్నారు.

ఈ నెల 22 నుంచి రీ వెరిఫికేషన్



ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ప్రకారం 200 ఇళ్లకు ఒక అధికారిని కలెక్టర్ నియమించనున్నారు. వారిచే రీ వెరిఫికేషన్ జరగనుంది. ఈ నెల 21వ తేదీ వరకు మండలాల వారీగా జాబితాలు రానున్నాయి. వాటిని ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో మళ్లీ పరిశీలన చేయనున్నారు. తుది జాబితాను జిల్లా కలెక్టర్ నుంచి ఇన్‌చార్జ్ మంత్రికి పంపించనున్నాం.

– దామోదర్, హౌసింగ్ పీడీ, సిద్దిపేట

ప్రభు చూపిన మార్గం అనుసరణీయం



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న సీఎస్ఐ చర్చి రెవరెండ్ ఆంటోని,పాస్టర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏసు ప్రభు చూపిన మార్గం అనుసరణీయమని, సీఎస్ఐ చర్చి రెవరెండ్ ఆంటోని అన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని, శనివారం జిల్లా కేంద్రంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చి నుంచి ప్రధాన రహదారుల గుండా రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంటోని మాట్లాడుతూ సమాజంలో మన చుట్టుపక్కల వారికి సహాయం చేయడం, పేదలకు అండగా నిలువడం, అందరితో కలిసిమెలిసి జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

కలెక్టర్ మను చౌదరి



చిన్నకోడూరులో మాట్లాడుతున్న కలెక్టర్

చిన్నకోడూరు(సిద్దిపేట): భూ సమస్యల పరిష్కారం దిశగా ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం చిన్నకోడూరు రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూ సమస్యలు ఉంటే తహసీల్దార్, ఆర్డీఓ తీసుకున్న నిర్ణయాలు సరైనవి కాదని భావించిన పక్షంలో నేరుగా బాధితులు అప్పీలు చేసుకునే అవకాశం లేదని, సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదన్నారు. భూ భారతి చట్టంతో తహసీల్దార్ వద్ద మ్యూటేషన్‌పై అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేస్తే నోటీసులు ఇచ్చి విచారించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కొత్త చట్టంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందం, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, తహసీల్దార్ హరి కిరణ్, ఎంపీడీఓ జనార్దన్, సొసైటీ చైర్మన్ సదానందం, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

రైతులు సన్న వడ్లను దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శనివారం మండల పరిధిలోని పెద్దకోడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం తూకంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, తాలు తీసే యంత్రంలో క్లీనింగ్ చేశాకే లోడ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య, ఎంపీడీఓ జనార్దన్, ఏపీఎం ఆంజనేయులు, నిర్వాహకులు ఉన్నారు.

నేటి భద్రత.. రేపటి భవిష్యత్తు

అవగాహన సదస్సులో హరీశ్ రావు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: వేసవికాలంలో సెలవులను సద్వినియోగం చేసుకోవాలని.. నేటి భద్రత రేపటి భవిష్యత్తు ఎదుగుదల అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పిల్లలకు దిశానిర్దేశం చేశారు. శనివారం స్థానిక మెట్రో గార్డెన్‌లో భద్రంగా ఉండాలి... భవిష్యత్తులో ఎదగాలి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈతకు వెళ్లి చెరువుల వద్ద సెల్ఫీ దిగుతూ చనిపోతున్న ఘటనలు, ఓవర్ స్పీడ్‌తో డ్రైవ్ చేసి రోడ్డు ప్రమాదంలో మరణాలు లాంటి ఘటనల పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో బుక్స్ చదవడం, డ్యాన్స్, మ్యూజిక్ లాంటివి నేర్చుకోవాలని, స్విమ్మింగ్ పూల్‌లో మాత్రమే ఈత కొట్టాలని సూచించారు. అంతకుముందు స్థానిక విపంచి ఆడిటోరియంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ గుర్తింపు శిబిరాన్ని ప్రారంభించారు. టీటీసీ భవన్‌లో కార్మిక సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం స్వర్ణోత్సవ వేడుకల గూర్చి సమావేశం నిర్వహించారు. అనంతరం హజ్ యాత్రకు వెళ్లే వారిని ఎమ్మెల్యే హరీశ్ రావు సన్మానించారు. అలాగే జాతీయ స్థాయిలో ఫుట్ బాల్ ఆడిన క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, నాయకులు రాజనర్స్, వేణుగోపాల్ రెడ్డి, సాయిరాం, కార్మిక సంఘాల నాయకులు పవన్, మల్లారెడ్డి, లక్ష్మణ్, అరవింద్, వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, భగవాన్, చిన్న పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- గ్రామాల్లో అధికారుల బృందం పర్యటన
- బూత్‌కు 8 చొప్పున ఇళ్ల కేటాయింపు
- సమస్యలను గుర్తించి మంత్రికి నివేదిక



గోవర్ధనగిరి గ్రామ సమావేశంలో ఏఈఈ సాయికృష్ణను నిలదీస్తున్న గ్రామస్తుడు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్లకు నిజమైన అర్హులను ఎంపిక చేయాలని మంత్రి ఓఎస్‌డీ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు అధికారుల బృందంతో పాటు మంత్రి ఓఎస్‌డీ, పీఏలు కిరణ్, వెంకటరమణ శనివారం గ్రామాల్లో పర్యటించారు. అక్కన్నపేట మండలంలోని బొడిగెపల్లి, గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, మసిరెడ్డితండా, ధర్మారం, పోతారం(జే), కపూర్‌నాయక్‌తండా, రామవరం గ్రామాలను సందర్శించి, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై పూర్తిస్థాయిలో మంత్రికి నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

బూత్‌కు 8 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు..

గ్రామంలో ఉన్న పోలింగ్ బూత్‌కు 8 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు అధికార బృందం తెలిపింది. ఇళ్ల మంజూరుకు కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన పేర్లను పరిశీలించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ మహేశ్, ఎంపీడీఓ జయరాం, తహసీల్దార్ అనంత రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ రమ్యశ్రీ, పంచాయతీ రాజ్ ఏఈఈ భిక్షపతి, భగీరథ ఏఈఈ సాయికృష్ణ, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, ఆర్ఐలు, పార్టీ మండలాధ్యక్షుడు అయిలయ్య, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం

అన్నదాత ఆందోళన

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- పలు చోట్ల ఈదురు గాలులకు ఇంటి పైకప్పులు ధ్వంసం
- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

జిల్లాలో శనివారం వీచిన ఈదురు గాలులతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. పలుచోట్ల మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఆరబోసిన ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గ్రామాల్లో ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.



కట్కూర్‌లో ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభం

హుస్నాబాద్‌రూరల్: మండలంలో వీచిన ఈదురు గాలులకు మీర్జాపూర్, వంగరామయ్యపల్లిలో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వర్షానికి కల్లాల్లో అరబెట్టిన ధాన్యం తడవడంతో కాపాడుకోనేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తడిసిన వరి ధాన్యం

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంతో పాటు లద్నూరు, ధర్మారం, సలాఖపూర్, వంగపల్లి, రేబర్తి గ్రామాల్లో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో పలు గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. లద్నూరు,ధర్మారం గ్రామాల్లో మామిడి చెట్లు విరిగి మామిడి కాయలు నేలరాలాయి. రహదారులు వెంట చెట్లు విరిగిపోయాయి.



మద్దూరులో వరదలో కొట్టుకుపోతున్న వరి ధాన్యం



దుబ్బాక మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

దుబ్బాకలో మళ్లీ వాన..

దుబ్బాక: దుబ్బాకలో శనివారం సాయంత్రం సుమారు అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దుబ్బాక మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని పెద్దగుండవెల్లి, దుంపలపల్లి, తిమ్మాపూర్, చెల్లాపూర్, రాజక్కపేట, మల్లాయపల్లి కొనుగోలు కేంద్రాల్లో సైతం వర్షానికి ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో సరిపడ టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేసి ధాన్యానికి కప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మళ్లీ వాన పడితే మొలకలు వస్తాయని, అధికారులు వెంటనే తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



పంతులత్‌తండాలో ఈదురు గాలులకు కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు

వణికించిన ఈదురుగాలులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని కట్కూర్, పంతులత్‌తండా, మల్లంపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులు వణికించాయి. పలువురి ఇంటి పైకప్పులు లేచి ఎగిరిపడ్డాయి. కట్కూర్ గ్రామంలో జేరిపోతుల కొమురయ్య అనే రైతు రేకుల పశువుల పాక పూర్తిగా ధ్వంసమై అందులో ఉన్న ఆవుపై పడి నడుము విరిగింది. పంటలు పూర్తిగా నేలకొరిగాయని పలువురు రైతులు వాపోయారు. వర్షంతో పాటు స్వల్పంగా వడగండ్లు పడినట్లు తెలిపారు.

స్వచ్ఛతలో సత్తా చాటేనా?

- మున్సిపాలిటీల్లో స్వచ్ఛతపై నిర్లక్ష్యం
- స్వచ్ఛ సర్వేక్షణ్ సమయంలోనే కార్యక్రమాలు
- నిరంతర ప్రక్రియగా సాగితేనే మంచి ఫలితాలు
- సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్‌లకు గతంలో ర్యాంకులు
- ఈసారి అదే తరహా ఫలితాలపై ఆశలు

గజ్వేల్: మున్సిపాలిటీల్లో అపరిశుద్ధ్యాన్ని తొలగించే కార్యక్రమాలు కొన్ని చోట్ల సమర్థవంతంగా, మరి కొన్ని చోట్ల అధ్వాన్నంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా చేపట్టే 'స్వచ్ఛ సర్వేక్షణ్' సమయంలోనే షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఫలితంగా పకడ్బందీగా చేపడుతున్న మున్సిపాలిటీల్లో మంచి ఫలితాలు వస్తుండగా, మిగితా చోట్ల పరిస్థితి అధ్వాన్నంగానే ఉంటున్నది.

జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. సిద్దిపేటలో పారిశుద్ధ్య కార్యక్రమాల తీరు దేశవ్యాప్తంగా ప్రశంసలను అందుకుంటున్నది.ఇక గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పరిస్థితి కొంత మెరుగుపడింది. ఈ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పడిన ఆర్అండ్ఆర్ కాలనీలతో కలుపుకొని 15వేలకుపైగా ఇండ్లు ఉండగా... జనాభా 80వేల పైచిలుకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో ఇక్కడ నిత్యం ఉత్పత్తి అవుతున్న చెత్త 20 మెట్రిక్ టన్నుల పైనే. ప్రస్తుతం పట్టణంలోని నల్లవాగుగడ్డ సమీపంలో ఉన్న సర్వే నం.25లోని ప్రభుత్వ భూమిలో 19 ఎకరాల్లో డంపింగ్ యార్డును నిర్మించారు. ఇందులో 9 ఎకరాలు డంపింగ్‌యార్డు, 2 ఎకరాలు స్లాటర్ హౌస్ (జంతు వధశాల), మిగితాది ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఇక్కడ తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసే ప్రక్రియ సమర్థవంతంగా సాగడం లేదు. కంపోస్టు తయారీ, పొడి చెత్తను ఆదాయంగా మార్చే ప్రక్రియ కూడా మొదలు కాలేదు. చెత్తను కేవలం బయో మైనింగ్ ద్వారా క్లీనింగ్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. బయోమైనింగ్ సక్రమంగా జరగక డంపింగ్ యార్డులో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడ తరుచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది.

మిగితా మున్సిపాలిటీల్లో నిర్వహణ లోపం...

హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 35వేల జనాభా, 6500 ఇండ్లు ఉన్నాయి. ప్రతి రోజు దాదాపు 11మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఒకటే డంప్‌యార్డు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చెత్త తరలింపు సమస్యగానే పరిణమించింది. దుబ్బాకలో 29వేల జనాభా ఉండగా... 7200 ఇండ్లు ఉన్నాయి. ఇక్కడ నిత్యం 4.25మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. చెత్త సేకరణ, వేరు చేయడం సక్రమంగా సాగడం లేదు. చేర్యాల మున్సిపాలిటీలో నివాస ప్రాంతాల పక్కన చెత్తను తగులబెట్టడం ఇబ్బందికరంగా మారుతోంది. కాగా ఆయా మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు తగినంత పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు లేకపోవడం కూడా సమస్యగా మారింది. మొత్తానికి చెత్త సేకరణ సక్రమంగా లేక ప్రజారోగ్యానికి శాపంగా మారింది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డు దుస్థితి

'స్వచ్ఛ సర్వేక్షణ్' ప్రారంభం ఎప్పుడు?

సిద్దిపేట మున్సిపాలిటీలో ఏటా 'స్వచ్ఛ సర్వేక్షణ్' కార్యక్రమాల్లో దేశంలోనే మెరుగైన ర్యాంకును సాధిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇదే క్రమంలో గజ్వేల్, హుస్నాబాద్‌లోనూ గతంలో మంచి ఫలితాలు వచ్చాయి. దుబ్బాక, చేర్యాలలో పరిస్థితులు మెరుగుపడాల్సి ఉన్నది. ఈ క్రమంలోనే 'స్వచ్ఛసర్వేక్షణ్' కార్యక్రమాలు ఈ సారి ఇంకా ఎప్పుడు మొదలుపెడతారోనని ఆసక్తి నెలకొన్నది. ఇందుకు సంబంధించి మున్సిపాలిటీలకు మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ఈ ఆదేశాలు వస్తే జోరుగా స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టనున్నారు. కాగా ఈ అంశంపై గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్యను వివరణ కోరగా..'స్వచ్ఛ సర్వేక్షణ్'కు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రాలేదని చెప్పారు. దీని ప్రమేయం లేకుండా స్వచ్ఛతా కార్యక్రమాలను నిరంతరం చేపడుతామన్నారు.

క్లుప్తంగా

ఇసుక రవాణాపై చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని దూల్మిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాలపల్లిలోని మోయతుమ్మెద వాగు నుంచి గ్రామానికి చెందిన మెతుకు రామకృష్ణారెడ్డి, మెతుకు సంజీవ్, తుపాకుల శ్రీనివాస్ అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకున్నామన్నారు. ఒక్కో వాహనానికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

మద్దూరు(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన దూల్మిట్ట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తుషాలపురం రమ ఇంట్లో శుక్రవారం రాత్రి వేళ ఫ్రిజ్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు ఎగిసి పడ్డాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి కూలర్, బట్టలు, ఇతర సామగ్రికి నిప్పంటుకొని కాలిపోయాయి. అదే విధంగా విలువైన డాక్యుమెంట్స్‌తోపాటు ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన నగదు కాలిపోయిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిని రెవెన్యూ అధికారులు శనివారం సందర్శించారు.

ఫామ్ హౌస్‌లపై పోలీసుల దాడి

- 8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): ఫామ్ హౌస్‌లపై పోలీసులు దాడి చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కూచారం, జీడిపల్లి శివారుల్లో ఫామ్ హౌస్‌లపై దాడి చేశాం. ఈ దాడిలో వింటర్ గ్రీన్ ఫామ్ హౌస్‌లో 8 మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నాం. వీరినుంచి పేకముక్కలు, రూ.11 వేల నగదు, 3 కార్లు, 8 ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

పటాన్‌చెరు టౌన్: ఓ పరిశ్రమలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ కథనం మేరకు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల ఉషా కాపర్ వైర్స్ పరిశ్రమలో సదాశివపేట పేటకు చెందిన కైరత్ మియా (53) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి పరిశ్రమ గేటు ఎదుట డ్యూటీ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ముఖంపై టవల్ కప్పి విచక్షణ రహితంగా కొట్టారు. దీంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గాయాలతో ఉన్న సెక్యూరిటీ గార్డును చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి, బాధితుడిని చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరుకు తీసుకెళ్లారు. శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బీడీఎల్ పోలీసులు పేర్కొన్నారు.

కలిసిమెలిసి ఉండాలి

- హంపీ పీఠాధిపతి భారతీ స్వామి



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న భారతీ స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు, సనాతన ధర్మం ఎంతో శ్రేష్ఠమైనవని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని అందె గ్రామంలోని శంభుని దేవాలయంలో శనివారం నిర్వహించిన బాణ లింగాభిషేక కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. లింగాభిషేకంలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. హిందూ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించినప్పుడే పల్లెలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందుతాయన్నారు. సమాజంలో ధర్మబద్ధంగా జీవిస్తేనే మోక్షం లభిస్తుందన్నారు. గ్రామాల్లో ఈర్ష, అసూయలు తగ్గించి అందరూ కలిసి మెలసి ఐక్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ, శివలింగం, యాదగిరి, సుమన్, పోచయ్య, ప్రవీణ్, కుమార స్వామి, కనకరాజు పాల్గొన్నారు.

ఇంజనీర్ల ఇలాకా..

40 మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో సగం మంది వీరే..



- చదువుకోవడానికి 8 కిలో మీటర్లు వెళ్లే యువత
- వలసలు వెళ్లి చదివించిన తల్లిదండ్రులు
- ఒకరిని చూసి మరొకరు ఉద్యోగాల వైపు అడుగులు
- గతంలో బాహ్య ప్రపంచానికి తెలియని తండా
- నేడు ఆదర్శంగా నిలిచిన కంగ్టి మండలంలో జబ్గి(బి) సాధు తండా

కంగ్టి(నారాయణఖేడ్): అదో మారుమూల తండా. బాహ్యప్రపంచానికి అంతగా తెలియని గిరిజన తండా. అక్కడేం ఉంటుందనుకుంటే పొరపాటే. తరచి చూస్తే చదువులమ్మకు నమస్కరించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపిస్తోంది. రోడ్డు వసతి ఉన్నా బస్సు ఎరగరు. తీవ్ర సమస్యలుంటే తప్ప అధికారులు సందర్శించిన దాఖాలాలుండవు. తాగునీటి కోసం తంటాలు పడాల్సిన దుస్థితి. సాగు భూములంతగా లేవు. వ్యవసాయ కూలీ పనులు చేస్తేనే పూట గడిచే పరిస్థితి. అలాంటి తండా నుంచి ప్రభుత్వ ఉద్యోగులు బయటకు కొచ్చారు. ఒక్కరి నుంచి మొదలైన ప్రభుత్వ ఉద్యోగం.. ఆ తర్వాత ముగ్గురు.. ఇలా ఒక్కొక్కరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ ఇప్పుడు ఆ సంఖ్య 40కి చేరింది. ఒకప్పుడు ఎవరికీ తెలియని కంగ్టి మండలంలో జబ్గి(బీ) సాధుతండా ఇప్పుడు అందరి నోటా వినబడుతుంది.

చదువుకోవడానికి 8 కిలో మీటర్లు

జబ్గి(బీ) సాధుతండాలో పాఠశాల లేదు. మండల కేంద్రానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి పిల్లలు చదువుకోవాలంటే నిత్యం ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న తడ్కల్ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లేవారు. తాము పడే కష్టం తమ పిల్లలు పడకూడదని చదివించారు. మొదట 1998లో ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. తండాకు చెందిన 1998లో కే.పండరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఉద్యోగం సాధించాడు. తర్వాత నారాయణ, మోతీరం 2000 సంవత్సరంలో ఒకేసారి ఉద్యోగం సాధించారు. అనంతరం 2004లో కుషాల్ ఇరిగేషన్ ఏఈగా ఉద్యోగం సాధించాడు. ఇలా ఒకరి వెనుక మరొకరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.



ట్రాన్స్‌కో విధుల్లో ఇద్దరు తండా ఇంజనీర్లు

వలసలు వెళ్తే గాని పూట గడవదు

తండాలో 120 ఇల్లు, కుటుంబాలు 152 ఉంటాయి. ఇక్కడ ఉన్న భూములు కూడా సాగు నీటి వసతి లేని ఎర్ర చెలుక భూములే. ఏడాదిలో ఎనిమిది నెలలు చెరకు నరికేందుకు, ఇటుక బట్టీలకు వలసలు వెళ్తే తప్ప బతుకు బండి నడవదు. పిల్లలను బడికి పంపేకంటే కూలీకి పంపితేనే బాగుంటుందని భావించే దుస్థితి. అలాంటి దుర్భర పరిస్థితిలో నుంచి ఏక కాలంలో నలుగురు ఇంజనీర్లను అందించింది ఈ సాధుతండా. అప్పటి నుంచి ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగం వరిస్తుందనే నమ్మకం కల్గింది తండాలోని గిరిపుత్రులకు. ఏకంగా 20 మంది ఇంజనీర్లు అయ్యి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

40 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాల్లో..

ప్రస్తుతం మండలంలో అత్యధిక ఉద్యోగులు ఉన్న తండాగా సాధు తండా పేరొందింది. దాదాపు 40 మందికి పైగా యువతీ, యువకులు పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో దాదాపు 20 మంది ఇంజనీరింగ్ ఉద్యోగులే ఉన్నారు. వీరంతా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే బ్యాంకుల్లోనూ, ఉపాధ్యాయులుగాను, వ్యవసాయాధికారులుగాను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లోనూ, దేశ సరిహద్దుల్లో సైనికులుగాను విధులు నిర్వహిస్తూ తండా ఖ్యాతిని నలుదిశలకు వ్యాపింపజేశారు. ఇంతే కాకుండా బయోటెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివిన అక్కాచెల్లెళ్లు చైతన్య, సింధూ యూఎస్‌ఏలో స్థిరపడ్డారు. వీరి కుటుంబంలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగాల్లో ఉన్నారు. తండాకు చెందిన రవిందర్ అనే యువకుడు దేశ సరిహద్దులో సైనికుడిగా పని చేస్తున్నాడు. తండాలో ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు పొంది చదువులు కొనసాగిస్తున్నవారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.



సోలార్ సిస్టం వద్ద హైద్రాబాద్ జిల్లా మేనేజర్‌గా విధుల్లో ఇంజనీర్ పండరి

సాధించాలనే పట్టుదలతో..



మా ఇద్దరు కూతుళ్లు ఒకరు ఎంబీబీఎస్ పూర్తి చేయగా మరో అమ్మాయి ఎన్ఐటీ త్రిచిలో సీటు సాధించింది. తల్లి ఉపాధ్యాయురాలు. దీంతో ఇంటిల్లిపాది ఉద్యోగాలు పొంది ఆర్థిక స్థిరత్వం సాధించే దిశగా ముందుకు వెళ్తున్నాం. మారుమూల తండానుంచి ఇంత పెద్ద ఉద్యోగంలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాను.

కే. పండరి, హైదరాబాద్ జిల్లా మేనేజర్ (టీజీఆర్ఈడీసీఓ)

పోటీతత్వంతో ఉన్నత చదువులు



తండాలో యువకులు ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తితో ఉన్నత చదువులు చదువుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడటం అభినందనీయం. తల్లిదండ్రులు సైతం పిల్లల చదువుల కోసం ప్రోత్సహించడంతో మా తండావాసులు ఉన్నత స్థాయిలో నిలుస్తున్నారు.

– నారాయణ, ఏఈ ట్రాన్స్‌కో, నారాయణఖేడ్

వలసలు వెళ్లి చదివించారు



మా తల్లిదండ్రులు వలసలు వెళ్లి డబ్బు సంపాదించి మాకు మంచి చదువులు చదివించడంతో మా జీవితాలు మారాయి. మేము మా పిల్లలను సైతం ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్నాం. తండాలోని యువతలో పోటీతత్వం, పోరాట పటిమ పెరుగుతోంది. ఒక్కొక్కరుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– మోతీరాం, ఏఈ ట్రాన్స్‌కో, మనూరు

మంచి పేరు ప్రఖ్యాతలు గడించాం



సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇరిగేషన్‌లో ఏఈగా ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాను. మా తండా నుంచి యువకులు, విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడి సాధిస్తుండటంతో మంచి ఖ్యాతి ఉంది. యువకులకు ఉన్నత చదువుల కోసం ప్రోత్సాహం అందిస్తున్నాం.

– కుషాల్, ఏఈ ఇరిగేషన్, నిజామాబాద్

దైవ దర్శనానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

శివ్వంపేట(నర్సాపూర్): దైవ దర్శనానికి వచ్చిన వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో తూప్రాన్- నర్సాపూర్ హైవే పై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ చింతల్ ప్రాంతానికి చెందిన గొల్ల లోకేశ్ (42) లిఫ్ట్ రిపేర్లు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం చాకరిమెట్లలోని ఆంజనేయస్వామి దర్శనం కోసం ఒక్కడే బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి లక్ష్మాపూర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

సిద్దిపేట అనారోగ్యంతో..

సిద్దిపేటకమాన్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. భువనగిరికి చెందిన ఎండీ నవాజ్ (40) ఏడాదిగా పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. కొన్ని నెలల కిందట క్యాన్సర్ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నాడు. దీంతో హోటల్‌లో పని మానేశాడు. అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ రోడ్డు డివైడర్ పక్కన నవాజ్ మృతి చెంది పడి ఉన్నట్లు స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న హోటల్ యజమాని జాకీర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



ఘటనాస్థలంలో లోకేశ్ మృతదేహం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

కౌడిపల్లి(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు శనివారం కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని శేరితండా పంచాయతీ వసురాంతండాకు చెందిన దుంగావత్ గేమ్‌సింగ్(35) కొన్నేళ్లుగా భార్యతో కలిసి గుమ్మడిదలలో ఉంటున్నాడు. 18 తండాలో చిట్టీ డబ్బులు కట్టాలని రూ.40 వేలు తీసుకొని గ్రామానికి వచ్చాడు. రాత్రి తండాకు చెందిన మోహన్, సలాబత్‌పూర్‌కు చెందిన జహీర్‌తో కలిసి మద్యం సేవించాడు. అనంతరం దాబాలో భోజనం చేస్తుండగా గేమ్‌సింగ్ అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెదక్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తన భర్త వెంట ఉన్న వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కామారెడ్డి జిల్లాలో చేగుంట యువకుడు మృతి



సంజయ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఈత కొట్టడానికి వెళ్లి యువకుడు మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు.. చేగుంటకు చెందిన తిరుపతి సంజయ్ (21) రామాయంపేట మండలం దామర చెరువులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం పక్కనే ఉన్న కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డి గ్రామంలో బంధువులు, స్నేహితులు అంతా కలిసి స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొట్టడానికి వెళ్లారు. స్విమ్మింగ్‌పూల్ లోకి దూకిన సందీప్ తలకు గాయమై ఫిట్స్ రాగా అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సందీప్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బట్టలు ఉతకడానికి వెళ్లి మహిళ

రామాయంపేట(మెదక్): చెరువులో మునిగి మహిళ మృతి చెందిన ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన బొగ్గుల అమృత (40) శుక్రవారం సాయంత్రం బట్టలు ఉతకడానికి గాను సమీపంలో ఉన్న పాండ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం ఆమె మృతదేహం నీటిలో తేలగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను అడవి పంది ఢీకొని

- ఇద్దరు యువకులకు గాయాలు
- చికిత్స పొందుతూ ఒకరు మృతి

చేగుంట(తూప్రాన్): బైక్‌కు అడవిపంది అడ్డురాగా కిందపడి గాయాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బోంది భాను(18)తోపాటు కనకరాజు ఇద్దరు బైక్‌పై రాజ్‌పల్లి గ్రామానికి వెళ్లి గురువారం తెల్లవారు జామున తిరిగి వస్తున్నారు. మండలంలోని పొలంపల్లి శివారులో అడవిపంది అడ్డు వచ్చి బైక్‌కు తగలడంతో ఇద్దరు కింద పడ్డారు. భానుకు తీవ్ర గాయాలు కాగా, మరో యువకుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. భానును సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

పురుగు మందు తాగిన యువతి



ప్రిస్కిల్లా

దుబ్బాకటౌన్: తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన రాయపోల్ మండలం మంతూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ప్రిస్కిల్లా (25) మూడేళ్లుగా మానసిక స్థితి సరిగ్గా లేక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. వైద్యుల సూచన మేరకు మందులు వేసుకోవాలి. కానీ, మందులు వేసుకోవడంలో ప్రిస్కిల్లా నిర్లక్ష్యం వహిస్తూ వస్తుంది. మందులు సకాలంలో వేసుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన 17న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ రఘుపతి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి

నర్సాపూర్ : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. గ్రామానికి చెందిన సార సురేశ్ (37) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. కుటుంబ విషయంలో సురేశ్ తరచూ భార్య మానసతో గొడవ పడుతుండేవాడు. శుక్రవారం రూ.1,000 ఇవ్వాలని భార్యను అడుగగా ఇప్పుడు లేవని తర్వాత ఇస్తానని చెప్పి కూరగాయలు తేవడానికి నర్సాపూర్‌కు వచ్చింది. ఇంటికి తిరిగి వెళ్లాక లోపలి నుంచి తలుపు గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా సురేశ్ పలకలేదు. ఇంటి చుట్టు పక్కల వారిని పిలిచి తలుపులు పగులగొట్టి చూడగా సురేశ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రైవింగ్ కోసం వెళ్లి వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్ : ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాహుల్ భరత్ బతుకుదెరువు కోసం ఏడాది కిందట వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తేజ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బస్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 10న సాయంత్రం బస్సు నడపడానికని వెళ్లి రాత్రి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్దకు వెళ్లి అడిగితే అతడికి రావాల్సిన డబ్బులు తీసుకొని వెళ్లిపోయాడని తెలిపారు. భర్త అదృశ్యంపై భార్య రేఖాదేవి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.



సునీల్



రాజేశ్



హర్షవర్ధన్




సిద్ధార్థ

జేఈఈ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: దేశవ్యాప్తంగా విడుదల చేసి న జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఫలితాల్లో గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపించి 26 మంది అర్హత సాధించారు. శనివారం గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో ఫలితాలను సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రాజు అభినందించారు. కళాశాల నుంచి 31 మంది పరీక్షలకు హాజరైతే 26 మంది అర్హత సాధించగా 10 మంది మంచి మా ర్కులు పొందినట్లు చెప్పారు. బీ.సునీల్ (81.98), టీ.రాజేశ్(81.94), జే.హర్షవర్ధన్ (81.72), డీ.సిద్ధార్థ (77.33), బీ.మోక్షజ్ఞ (77.04) మార్కులు సాధించారు. గురుకులాల కేంద్ర కార్యాలయం అందించిన స్టడీ మెటీరియల్ చదువడం ద్వారానే మా విద్యార్థులు ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పేదోడి కడుపు నింపేందుకే సన్న బియ్యం

- గరిబోళ్ల ఆరోగ్యం, ఆత్మగౌరవం పెంచిన కాంగ్రెస్ సర్కార్
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- ముత్తంగిలో దళితుల ఇంట్లో భోజనం



ముత్తంగిలో ఓ ఇంట్లో భోజనం చేస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ప్రతీ పేదోడి కడుపు నింపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో దళిత సోదరుడు విఠల్ ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనం కుటుంబ సభ్యులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న పాలనపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దీనికి ఆ కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కల ప్రజలు సానుకూలంగా సమాధానం చెప్పి ఇందిరమ్మ పాలనపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. గతంలో దొడ్డు బియ్యం పంపిణీతో అన్నం తినలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారని మరో పక్క దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి దళారుల దందాకు ఉపయోగపడేవన్నారు. అందుకే నిరంతరం పేదల సంక్షేమం అభివృద్ధి కోసం ఆలోచించే సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ పేద బిడ్డ కడుపు నింపాలనే తలంపుతో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ముత్తంగి మాజీ ఎంపీటీసీ గడ్డ యాదయ్య, నాయకులు శ్రీను, అశోక్, సన్నీ యాదవ్, శంకర్, దశరథ్, వెంకటేశ్, శ్రీను, ప్రవీణ్, కాళిదాస్, రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరకు సాగులో నూతన వంగడాలు

జిల్లాలో రైతులు వేల ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారు. దీర్ఘకాలిక వాణిజ్య పంట కావడంతో సంవత్సరం కాలంపాటు ఒకే పంటపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. పాత రకాలనే సాగు చేయడం, మరో వైపు పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు రైతులు ఎంచుకుంటారు. ప్రస్తుతం జహీరాబాద్ ప్రాంత రైతులు 3102 రకం చెరకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– జహీరాబాద్ టౌన్

- 3102 రకం సాగుపై రైతుల ఆసక్తి
- ఎకరాకు 60 టన్నుల దిగుబడి
- జహీరాబాద్‌లో సుమారు 3 వేల ఎకరాల్లో సాగు
- పెరుగుతున్న పంట విస్తీర్ణం

జహీరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల రైతులు అధిక విస్తీర్ణంలో చెరకు పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన రకాలనే పండిస్తున్నారు. సాధారణంగా ఎకరానికి 40 టన్నుల వరకు దిగుబడి రావాలి కానీ ప్రస్తుత పరిస్థితుల్లో 25 టన్నులు దాటడం లేదు. అందుకని రైతులు అధిక దిగుబడి ఇచ్చే రకాల సాగుపై మొగ్గు చూపుతుంటారు. జిల్లాలో అధికశాతం కో 86032, కో 808005, 87025, 83ఎ30 తదితర రకాలను పండిస్తున్నారు. వీటిలో చెక్కర శాతంతోపాటు దిగుబడి కూడా వస్తుందని కర్మాగారాల యాజమాన్యాలు వీటినే సూచిస్తున్నారు. పెద్దగా లాభాలు లేకున్నా నష్టం రాదన్న ఉద్దేశ్యంతో తప్పని పరిస్థితుల్లో రైతులు ఈ రకాల పంటను పండిస్తున్నారు.

పెరిగిన 3102 రకం పంట విస్తీర్ణం

జహీరాబాద్ ప్రాంతంలో రెండు, మూడేళ్ల నుంచి కొంత మంది రైతులు అధిక దిగుబడినిచ్చే 3102 కొత్త రకం చెరకు పంటను పండిస్తున్నారు. ఈ రకం పంట అధిక దిగుబడి వస్తుందని సాగుపై మొగ్గు చూపడంతో పంట విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం సుమారు 3 వేల ఎకరాల్లో ఈ రకం చెరకు పంట సాగవుతోంది. అధిక విస్తీర్ణంలో సాగవుతున్న కో 86032, కో 808005 తదితర రకాల చెరకు పంట ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. అదే 3102 రకం అయితే 60 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. చెరకు గడలు ఏపుగా పెరుగుతాయి. ఎరువులు, కలుపు మొక్కల నివారణ ఖర్చులు తక్కువగా ఉంటున్నాయని చెప్పారు. కొత్త రకం పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండటంతో విత్తనంకు డిమాండ్ పెరిగి టన్నుకు రూ. 5 వేలు పలుకుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



ఎత్తు పెరిగిన 3102 రకం చెరకు గడలు

లాభాలు వస్తున్నాయి

శాస్త్రవేత్తలు, చెక్కర కర్మాగారం కంపెనీ యాజమాన్యం సూచించిన కో 86032, కో 808005 రకాలకు కొన్ని సంవత్సరాల నుంచి పండిస్తున్నాం. పెట్టుబడులు పెరగడం తప్ప ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. లాభాలు తగ్గడంతో రెండేళ్ల నుంచి 3102 రకం పంటను సాగు చేస్తున్నా. పంట దిగుబడి పెరిగి లాభాలు వస్తున్నాయి. విత్తనం కూడా మంచి డిమాండ్ ఉంది.